
పారాహుషార్....!

ఏప్రిల్ నుంచి 6 శాతం పెరగనున్న ఆస్తి పన్ను ● ప్రభుత్వ అనుమతి కోరిన మున్సిపల్ పరిపాలనా విభాగం



పెరంబూర్, సెప్టెంబరు 19: రాష్ట్రంలో 2025-26వ ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను 6 శాతం పెంచేందుకు ప్రభుత్వాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అనుమతి కోరింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లో 1998లోను, కార్పొరేషన్ విస్తరించిన ప్రాంతాలు, ఇతర కార్పొరేషన్‌లలో 2008లో ఆస్తి పన్ను పెంచారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ సిఫారసు ప్రకారం, స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరేలా ప్రతి ఏటా ఆస్తి పన్ను పెంచాల్సివుంది. ఆ ప్రకారం, 2022-23లో స్థానిక సంస్థల్లో ఆస్తి పన్ను పెరిగింది. ఆ ప్రకారం, 600 చ.అ తక్కువగా ఉన్న ఇళ్లకు 25 శాతం, 601-1,200 చ.అ వరకు 50 శాతం ఆస్తి పన్ను పెంచారు. అలాగే, 1,201-1,800 చ.అ వరకు ఉన్న ఇళ్లకు 75 శాతం, 1,800 చ.అ పైబడిన వాటికి 100 శాతం ఆస్తి పన్ను పెరిగింది. ఇక, వాణిజ్యపరమైన భవనాలకు 100 శాతం, కర్మాగారాలు, విద్యా సంస్థలకు చెందిన భవనాలకు 75 శాతం పెరిగింది. చెన్నై కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లో వాణిజ్యపరమైన భవనాలకు 150 శాతం, కర్మాగారాలు, విద్యాసంస్థలకు చెందిన భవనాలకు వంద శాతం పెంచారు. ఆస్తి పన్ను పెంపునకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీవోలో 15వ ఫైనాన్స్ కమిషన్ సూచనల మేరకు, ప్రతి ఏడాది ఆస్తి పన్ను పెంచనున్నట్లు పేర్కొంది.

ఆస్తి పన్ను పెంపు నుంచి మినహాయింపు...

చెన్నై, తిరునల్వేలి, తూత్తుకుడి తదితర జిల్లాలు 2023లో సంభవించిన వరదలతో భారీ నష్టం చవిచూశాయి. ఈ కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో వరద బాధిత జిల్లాల్లో ఆస్తి పన్ను పెంచలేదు. ఈ నేపథ్యంలో, 2025-26వ ఆర్థిక సంవత్సరం 6 శాతం ఆస్తి పన్ను పెంపునకు మున్సిపల్ పరిపాలనా విభాగం అనుమతి కోరింది. అదే సమయంలో, 2025లో స్థానిక ఎన్నికలు, 2026లో శాసనసభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, ఆస్తి పన్ను పెంచితే అధికార పార్టీకి ఏర్పడే ఇబ్బందులను కూడా అంచనా వేస్తున్నారు.

జీసీసీకి రూ.110 కోట్ల అదనపు ఆదాయం...

మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగం అధికారులు మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రతి ఏడాది ఆస్తి పన్ను పెంపు ఉంటుందని రాష్ట్రప్రభుత్వం జీవోలో స్పష్టం చేసిందని గుర్తు చేశారు. గత ఏడాది సంభవించిన వరదల కారణంగా, ఆస్తి పన్ను పెంపునకు రాష్ట్రప్రభుత్వం అంగీకరించలేదని, ఆర్థిక లోటు పరిగణలోకి తీసుకొని, వచ్చే ఏడాది ఆస్తి పన్ను పెంపుకు చర్యలు చేపట్టామని వివరించారు. ఆ ప్రకారం, 6 శాతం ఆస్తి పన్ను పెరగనుంది. ఇది విధానపరమైన నిర్ణయం కావడంతో, రాష్ట్రప్రభుత్వ అనుమతి కోరాము. ప్రభుత్వ అనుమతి లభిస్తే గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)కి అదనంగా రూ.110 కోట్ల ఆదాయం లభిస్తుందని, అలాగే ఇతర స్థానిక సంస్థల్లో మౌలిక వసతుల కల్పనగా అవసరమైన నిధులు కూడా సమకూరే అవకాశముందని అధికారులు తెలిపారు.



ముఖ్యమంత్రి స్టాలిన్‌తో దౌహీత్ జమాత్ నేతలు

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించండి

స్టాలిన్‌కు దౌహీత్ జమాత్ విజ్ఞప్తి ● సీఎంతో భేటీ

అడయార్, సెప్టెంబరు 19: వక్ఫ్ చట్టంలో ప్రతిపాదించిన 44 సవరణలను తీవ్రంగా వ్యతిరేకించాలని సీఎంను కోరినట్టు దౌహీత్ జమాత్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆర్.అబ్దుల్ కరీం తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో దౌహీత్ జమాత్‌కు చెందిన అగ్రనేతలు సమావేశమయ్యారు. సచివాలయంలో జరిగిన ఈ భేటీలో దౌహీత్ జమాత్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆర్.అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి ముజఫర్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారంతా సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. గత యేడాది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సీఏఏ చట్టాన్ని వ్యతిరేకించడమే కాకుండా, ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినపుడు డీఎంకే సభ్యులు వాకౌట్ చేసినందుకు సీఎంకు వారు ధన్యవాదాలు తెలిపారు. సీఎంతో భేటీ తర్వాత అబ్దుల్ కరీం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముస్లింలకు దివంగత కరుణానిధి సీఎంగా ఉన్న సమయంలో 3.5 శాతం రిజర్వేషన్లు కల్పించారని, ఇపుడు జనాభా ఆధారంగా ఈ రిజర్వేషన్ శాతాన్ని 7 శాతానికి పెంచాలని సీఎంను కోరినట్టు చెప్పారు. గతంలో ముస్లిం రాజులు, ముస్లిం వర్గానికి చెందిన కోటీశ్వరులు ఆస్తులను మసీదులకు దానం చేశారన్నారు. వీటి నిర్వహణ వక్ఫ్ బోర్డులు పర్యవేక్షిస్తున్నాయన్నారు. అయితే, ఇపుడు కేంద్రం వక్ఫ్ చట్టంలో సవరణ చేసేందుకు సిద్ధమైందన్నారు. ఇది ముస్లింలకు తీవ్ర హాని చేస్తుందేగానీ, మేలు చేయదన్నారు.



మృతురాలు దీప (ఫైల్ ఫొటో)

దురైపాక్కంలో మహిళ దారుణహత్య

● ముక్కలుగా కోసి సూట్ కేస్‌లో కుక్కిన వైనం
● నిందితుడి ఆచూకీ తెలిపిన సీసీ ఫుటేజి ● ఒకరి అరెస్టు

పెరంబూర్, సెప్టెంబరు 19: స్థానిక దురైపాక్కం ప్రాంతంలో ఓ మహిళను హత్య చేసి, శరీరాన్ని ముక్కలుముక్కలుగా కోసి సూట్‌కేస్‌లో పెట్టిన ఘటన కలకలం రేపింది. ఈ వ్యవహారంలో పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి... దురైపాక్కం కుమరన్ కుటిల్ మెయిన్ రోడ్డులో ఓ భవన నిర్మాణం జరుగుతోంది. గురువారం ఉదయం పనికి వచ్చిన మారి అనే కార్మికుడు ఆ ప్రాంతంలో ఓ సూట్‌కేస్ ఉండడం గమనించి, దానిని కాలితో పక్కకు తన్నడంతో సూట్‌కేస్ నుంచి రక్తం కారడం చూసి వెంటనే దురైపాక్కం పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అక్కడకు చేరుకొని సూట్ కేస్ పరిశీలించగా, ముక్కలు ముక్కలుగా నరికిన మహిళ మృతదేహం కనిపించింది. సంఘటనా స్థలాన్ని నగర డిప్యూటీ కమిషనర్ సీబీ చక్రవర్తి, అడయార్ సహాయ కమిషనర్ పొన్‌కార్తీక్ కుమార్ పరిశీలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో... మృతురాలు మనలికి చెందిన దీప (32) అని తేలింది. అవివాహితురాలైన ఆమె.. వ్యభిచారం చేస్తున్నట్లు తెలిసింది. పొరుగు ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం చేయించే ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమైంది. దీంతో, పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీ పరిశీలించగా, ఓ వ్యక్తి సూట్ కేస్ అక్కడ విసిరేసి వెళ్లడం కనిపించింది. అతడు అదే ప్రాంతానికి చెందిన మణికంఠన్‌గా గుర్తించిన పోలీసులు.. అతడిని అరెస్టు చేశారు. బుధవారం రాత్రి వ్యభిచారం కోసం దీపను బ్రోకర్ ద్వారా రప్పించుకున్న మణికంఠన్.. డబ్బు విషయంలో గొడవ పడి, కోపంతో ఆమెను కత్తితో పొడిచి హతమార్చాడు. మృతదేహాన్ని ఎవ్వరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు ముక్కలుముక్కలుగా కోసి సూట్‌కేస్‌లో దాచిపెట్టినట్లు పోలీసుల ముందు నిందితుడు అంగీకరించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు మణికంఠన్

25న ప్రధానితో స్టాలిన్ భేటీ



చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమావేశం కానున్నట్లు తెలిసింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతో కూడా సీఎం స్టాలిన్ భేటీ కానున్నారు. అలాగే, ఇటీవల మృతిచెందిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించనున్నారు. నగరంలో మెట్రోరైలు రెండో విడత పనులు రూ.63,246 కోట్లతో జరుగుతుండగా, అందులో రాష్ట్ర వాటా రూ.22,228 కోట్లు, కేంద్రప్రభుత్వ వాటా రూ.7,425 కోట్లు కాగా, మిగిలిన రూ.33,593 కోట్లకు చెన్నై మెట్రోరైలు సంస్థ విదేశీ సంస్థల నుంచి రుణంగా పొందాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఈ పనులకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. అంతేకాకుండా కేంద్రప్రభుత్వ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించకపోవడంతో విద్యా నిధులు కూడా అందించలేదు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అంగీకరిస్తూ, అందుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం సంతకం చేస్తేనే నిధులు మంజూరు చేస్తామని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల ముఖ్యమంత్రికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. ఈ క్రమంలో, ఇటీవల అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన ముఖ్యమంత్రి స్టాలిన్ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ... మెట్రోరైలు పథకం నిధులు అందించే విషయమై ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ కోరామని, ఆ సమయంలో కొత్త జాతీయ విద్యా విధానంపై తమ అభిప్రాయం తెలియజేయనున్నట్లు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం ఢిల్లీ వెళ్లనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో, ప్రధాని మోదీ ఈ నెల 21 నుంచి 23వ తేది వరకు అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. దీంతో, ఈ నెల 25వ తేది ప్రధాని మోదీని కలిసేందుకు ప్రధానమంత్రి కార్యాలయం సమయం కేటాయించినట్లు సమాచారం. అందుకోసం ముఖ్యమంత్రి స్టాలిన్ 24వ తేది సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. ఆ రోజు రాత్రి తమిళనాడు భవన్‌లో సీఎం బసచేసి మరుసటి రోజు ప్రధాన మంత్రితో భేటీ కానున్నారు.



మీడియా సమావేశంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై తదితరులు

రాష్ట్రంలో కామరాజర్ పాలనే లక్ష్యం

● టీఎన్‌సీసీ కార్యాచరణ మండలిలో తీర్మానం

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్ళీ కామరాజర్ పాలనను తీసుకురావటమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని గురువారం జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ కార్యాచరణ మండలిలో సంచలనాత్మక తీర్మానం చేసింది. టీఎన్‌సీసీ కార్యాచరణ మండలి, జిల్లా అధ్యక్షుల సమావేశం రాయపేటలోని సత్యమూర్తి భవన్‌లో జరిగింది. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఇన్‌ఛార్జులుగా నియమితులైన సూరజ్ హెగ్డే, అజయ్‌కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. రాబోవు శాసనసభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధానంపై చర్చ జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ సారి ఎక్కువ సీట్లలో పోటీ చేయాలని సీనియర్ నేతలు సూచించారు. కేంద్ర ప్రభుత్వం కుల గణన చేపట్టాలని కోరుతూ మరొక తీర్మానం ప్రతిపాదించారు. రాహుల్‌గాంధీని కించపరిచేలా విమర్శలు చేస్తున్న బీజేపీ నేతల వైఖరిని ఖండిస్తూ నిరసన ప్రదర్శనలు జరపాలని సమావేశం పిలుపునిచ్చింది. అదేవిధంగా నిదుల కేటాయింపులలో కేంద్రం రాష్ట్రానికి మొండిచేయి చూపటం గర్హనీయమని, వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశం అనంతరం కొత్తగా నిర్మించిన హాలును సెల్వపెరుంతగై ప్రారంభించారు. ఆ తర్వాత జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశం కొనసాగింది. టీఎన్‌సీసీ మాజీ నేతలు తంగబాలు, కేఎస్ అళగిరి, ఈవీకేఎస్ ఇలంగోవన్, కృష్ణసామి, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు హసన్ మౌలానా, మునిరత్నం, తారగై కథ్‌పట్, రాష్ట్ర శాఖ డిప్యూటీ అధ్యక్షులు స్వర్ణా సేతురామన్, నాసే రామచంద్రన్, గోపన్నా, రంగభాష్యం, దళపతి భాస్కర్, ఎంఎస్ ద్రవియం, శివరాజ్ శేఖర్, ముత్తళగన్, డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పథకాలకు రూ.6వేల కోట్లు

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్



చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మూడో సారి దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ప్రధాని నరేంద్రమోదీ వందరోజుల పాలనలో రాష్ట్రంలో రైల్వే పథకాలకు కేంద్ర ప్రభుత్వం రూ.6వేల కోట్ల వరకు నిధులు విడుదల చేసిందని కేంద్ర సమాచార శాఖ సహాయమంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ వందరోజుల్లో దేశంలో రూ.15 లక్షల కోట్ల విలువైన భారీ ప్రాజెక్టులు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని తూత్తుకుడి హార్బర్ అభివృద్ధికి రూ.7వేల కోట్లకు పైగా నిధులు కేటాయించిందన్నారు. దేశంలో సెమికండక్టర్ మిషన్ ప్రాజెక్టు అమలు చేయడానికి రూ.76 వేల కోట్ల మేర నిధులు మంజూరు చేసిందని తెలిపారు. మదురై-నాగర్‌కోవిల్, మదురై - బెంగళూరుకు వందే భారత్ రైళ్ల ప్రారంభించారని, ఇప్పటికే రాష్ట్రంలో ఐదు వందే భారత్ రైళ్లు పరుగులు తీస్తున్నాయన్నారు. ఇక రాష్ట్రంలో రహదారి పాజెక్టులకు రూ.20వేల కోట్లు కేటాయించిందని,, ఇందులో ముగైయూరు - మరక్కాణం జాతీయ రహదారి, సేలం - తిరుపత్తూరు - వాణియంబాడి ఫోర్‌వే, కారైక్కుడి - రామనాథపురం టూవే, చెట్టికుళం - నత్తం, తిరుచ్చి - కాంగేయం ఫోర్‌వే రహదారుల నిర్మాణాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఇదే విధంగా రాష్ట్రంలో రైల్వే పథకాలకు రూ.6వేల కోట్ల మేర నిధులు కేటాయించిందని, ఆ పథకాలు పూర్తయితే రాష్ట్రంలో వాణిజ్య విస్తరణ కలాపాలు పెరుగుతాయని తెలిపారు. మహిళాభ్యుదయానికి కూడా కేంద్రం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ వందరోజుల్లోనే 15 వేల మంది నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లుతెలిపారు. వందరోజుల్లో ఇవన్నీ సాధ్యం చేయగలిగిన సత్తా ప్రధాని మోదీకి మాత్రమే ఉందని మురుగన్ పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

● అనవసర లింక్‌లు క్లిక్ చెయ్యొద్దు
● హెచ్చరించిన పోలీసులు

పెరంబూర్, సెప్టెంబరు 19: బ్యాంక్ ఖాతాలో నగదు జమ అయిందని మెసేజ్‌లు పంపి, బ్యాంక్ ఖాతా హైక్ చేసి మోసం చేస్తున్న ఘటనలు రోజురోజుకు అధికమవుతున్నాయి. ఇలాంటి మోసాలకు గురికాకుండా ఉండాలంటే మొబైల్ ఫోన్‌కు వచ్చే అనవసర మెసేజ్‌లు క్లిక్ చేయవద్దని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగవంతగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పలు పరిశోధన సంస్థలు నిర్వహించిన సర్వేల్లో వెల్లడైంది. దేశవ్యాప్తంగా సుమారు 113 కోట్లకు పైగా మొబైల్‌ఫోన్లను ప్రజలు వినియోగిస్తున్నారు. వీరిలో సగానికి పైగా ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. దీంతో కొన్ని అసాంఘిక శక్తులు వినూత్న రీతిలో సైబర్ నేరాలకు పాల్పడుతూ, ప్రతిరోజు కోట్ల రూపాయలు దోచుకుంటున్నాయి.

మెసేజ్ ద్వారా మోసాలు...

ప్రస్తుతం, మొబైల్ ఫోన్లకు బ్యాంక్ ఖాతాలో నగదు క్రెడిట్ అయిందంటూ మెసేజ్‌లు వస్తున్నాయి. అందులో ఉన్న లింక్ పొరపాటున క్లిక్ చేస్తే చాలు, ఆ సెల్‌ఫోన్‌ను పూర్తిగా హైక్ చేసి బ్యాంక్ ఖాతా నుంచి నగదు కాజేస్తున్నారు. అలాగే, ఆ లింక్ క్లిక్ చేయడం ద్వారా, మనకు తెలియకుండానే మన సెల్‌ఫోన్ లోని అన్ని వివరాలను ఆ ముఠా చేతికి వెళ్లిపోతాయి.

గూగుల్ పే మోసాలు...

అలాగే, గూగుల్ పే ఖాతా ఉన్న వారికి గుర్తుతెలియని వ్యక్తులు కొంత నగదు పంపిస్తారు. కొద్దిసేపటి తర్వాత సదరు వ్యక్తి కాల్ చేసి, పొరపాటున నగదు జమ అయిందని, ఆ నగదును ఈ నెంబరుకు తిరిగి పంపాలని విజ్ఞప్తి చేస్తాడు. అతడి అభ్యర్థన అంగీకరించి, అతను చెప్పిన గూగుల్ పే ఖాతా క్లిక్ చేసిన కొద్దిసేపటికే, బ్యాంక్ ఖాతాలోని నగదు పూర్తిగా చోరికి గురవుతోంది. అలా, పొరపాటున ఎవరైనా గూగుల్ పే ద్వారా నగదు కోల్పోయిన పక్షంలో, వారు వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి, తగిన గుర్తింపుకార్డు చూపించి కోల్పోయిన నగదు తిరిగి పొందవచ్చని రాష్ట్ర పోలీసు శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది. అలాగే, సైబర్ క్రైం మోసానికి గురయ్యే వారు, వెంటనే రాష్ట్ర సైబర్ క్రైం హెల్ప్ లైన్ నెంబరు '1930'కు ఫిర్యాదు చేయాలని పోలీసు శాఖ సూచించింది.



సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెంబరు

నగదు క్రెడిట్ అయిందంటూ అపరిచితులు పంపే మెసేజ్

ఇంత ఆలస్యమా ?

● రేషన్, ఆధార్ కార్డులు ఇచ్చేందుకు మూడు నెలలా....?
● రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



ప్యారీస్, సెప్టెంబరు 19: రేషన్, ఆధార్ కార్డులు అందించేందుకు మూడు నెలలు ఎందుకు? అని రాష్ట్రప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. కళ్లకుర్చి కల్తీసారా ఘటనకు సంబంధించి కొండ గ్రామాల ప్రజలు జీవనస్థితిగతులు మెరుగుపరిచేలా మద్రాసు హైకోర్టు సుమోటాగా కేసు నమోదుచేసి విచారిస్తోంది. గతంలో ఈ కేసు విచారణకు రాగా, కల్వరాయన్ కొండ ప్రాంత ప్రజలకు రేషన్, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు నాలుగు వారాల్లో అందజేయాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, ఈ కేసు విచారణ గురువారం న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, మాలాతో కూడిన ధర్మాసనం విచారించింది. న్యాయస్థానం ఉత్తర్వులతో గుర్తింపు కార్డులు అందజేసేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి 2 వేల మంది నుంచి దరఖాస్తులు స్వీకరించామని, వాటిని పరిశీలించి కార్డులు అందజేసేందుకు మూడు నెలలు సమయం కావాలని, కార్డులిచ్చిన తర్వాత నివేదిక దాఖలుచేస్తామని రాష్ట్రప్రభుత్వం వివరణ ఇచ్చింది. దానికి అభ్యంతరం తెలిపిన ధర్మాసనం, నివేదిక సమర్పించాల్సిన అవసరం లేదని, రేషన్, ఆధార్ కార్డులు ఇచ్చేందుకు మూడు నెలలు ఎందుకని రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అలాగే, కల్వరాయన్ ప్రాంతాల వ్యవహారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందని, ఆ ప్రకారం న్యాయస్థానం ఉత్తర్వులు అమలుచేయని పక్షంలో, ప్రధాన కార్యదర్శి న్యాయస్థానంలో హాజరుకావాల్సిన పరిస్థితి వస్తుందని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ప్రాంత ప్రజలు రేషన్, ఆధార్ కార్డులు అందించాలని, ఆ గ్రామానికి బస్సు సౌకర్యం, ఉపాధ్యాయులతో పాఠశాలలు నడపడం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు సంబంధించి నివేదిక దాఖలుచేయాలని ఆదేశించిన ధర్మాసనం, తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.

సమాచార దర్శిని

పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 19: పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. కోవై తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో 11 కళాశాలల్లో 34 శాఖల్లో పీజీ, 29 శాఖల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 16వ తేది దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. విద్యార్థులు ఈ నెల 30వ తేది వరకు https://admissionsatpgschool.tnau.ac.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 9489056710 నెంబరు సంప్రదించవచ్చు.

అంబత్తూర్‌లో ఐటీ పార్క్

ఐసిఎఫ్, సెప్టెంబరు 19: స్థానిక అంబత్తూర్‌లో ఐసీఎంసీ-ఐటీ పార్క్ ఏర్పాటైంది. నగరంలో విదేశీ, స్వదేశీ ఐటీ సంస్థలున్నాయి. అంబత్తూర్ ఎస్టేట్‌లో చెన్నై బైపాస్‌ను ఆనుకొని ఐసీఎంసీ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ కొత్త ఐటీ పార్క్‌ను 12 అంతస్తులతో నిర్మించింది. ఇందులో ఒకేసారి 2,200 మంది పనిచేసే సౌకర్యం కల్పించారు. దీని ఎదురుగా ఉన్న మెడిట్రయిన్ షిప్పింగ్ కంపెనీ ఈ కొత్త ఐటీ పార్క్‌కు మారనున్నట్లు అధికారులు తెలిపారు.

23 నుంచి డ్రోన్ శిక్షణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 19: యువకులకు స్వీయ ఉపాధి కల్పించేలా స్థానిక ఈకాట్టుతాంగల్‌లోని సిడ్కో ఎస్టేట్‌లో డ్రోన్ ఆపరేటింగ్‌లో మూడు రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 23 నుంచి 25వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటలకు వరకు జరిగే శిక్షణా తరగతుల్లో డ్రోన్ రకాలు, పర్యవేక్షణ, ఆపరేటింగ్ నిబంధనలు, సిములేటర్, సెన్సార్ పర్యవేక్షణ, మ్యాపింగ్ సమన్వయం, రేడియో టెలిఫోనిక్స్ వంటి వాటిపై శిక్షణ ఇస్తారు. టెన్త్ ఉత్తీర్ణులై 18 ఏళ్ల పైబడిన వారు శిక్షణలో పాల్గొనవచ్చు. ఇతర వివరాలకు 8668102600, 7010143022 నెంబర్లు సంప్రదించవచ్చు.

బధిరుల కోసం తిరుక్కురల్ వీడియో

ఐసిఎఫ్, సెప్టెంబరు 19: ప్రాచీన తమిళ పరిశోధన కేంద్రం తమిళ సాహిత్యాలను వివిధ భాషల్లో అనువదిస్తుంది. ఆ ప్రకారం, మూగ భాషలో తిరుక్కురల్ వీడియో రూపొందించింది. ఇదివరకే 36 భాషల్లో తిరుక్కురల్ తర్జుమాలున్నాయి. అంధుల కోసం బ్రెయిలి లిపిలో 41 గ్రంథాలు అనువదించారు. ఈ నేపథ్యంలో, బధిరుల కోసం తిరుక్కురల్ వీడియోలు తయారుచేశారు. వీటిని త్వరలో విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

12 బోగీలతో ప్యాసింజర్ రైళ్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 19: తక్కువ దూరం నడిచే 10 ప్యాసింజర్ రైళ్లు అక్టోబరు 1వ తేది నుంచి 12 బోగీలతో నడవనున్నాయని దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. చెన్నై బీచ్-మేల్‌మరువత్తూర్, అరక్కోణం-సేలం, సేలం-మైలాడుదురై సహా 15కు పైగా మార్గాల్లో 8 బోగీలతో ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వీటిలో రద్దీ ఎక్కువగా ఉండడంతో 12 పెట్టెలతో నడిపేందుకు అధికారులు నిర్ణయించారు. వీటిలో డిజిటల్ స్క్రీన్లు కూడా ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

మీటర్ లేని 28 లక్షల విద్యుత్ కనెక్షన్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 19: రాష్ట్రంలో గృహాలు, కర్మాగారాలు వంటి విద్యుత్ కనెక్షన్లలో మీటరు లేనివి 28 లక్షలున్నాయి. అలాగే, 23.43 లక్షల వ్యవసాయ కనెక్షన్లలో 4.26 లక్షలకు మాత్రమే మీటర్లు అమర్చారు. మార్చి 31నాటి సర్వే ప్రకారం, రాష్ట్రాల వారీగా ఉన్న విద్యుత్ కనెక్షన్లకు అమర్చిన మీటర్ల వివరాలను కేంద్ర విద్యుత్ శాఖ విడుదల చేసింది. రాష్ట్రంలో 3.32 కోట్ల కనెక్షన్లలో 91.54 శాతం (3.04 కోట్లు) కనెక్షన్లకు మాత్రమే మీటర్లు అమర్చినట్లు తెలిసింది. గృహాల్లో 96.38 శాతం, వ్యవసాయ విభాగంలో 18.20 శాతం కనెక్షన్‌లకు మాత్రమే మీటర్లున్నాయి.

పెంపుడు జంతువుల కోసం నేత్ర వైద్య శిబిరం

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'సంచు జంతు సంరక్షణా ఆస్పత్రి' ఆధ్వర్యంలో పెంపుడు జంతువుల కోసం ఈ నెల 21, 22 తేదీల్లో ఉచిత కంటివైద్య శిబిరం జరుగనుంది. అడయార్‌లోని ఈ ఆస్పత్రిలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగనున్న ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన పశువైద్యులు జంతువులకు చికిత్స అందిస్తారని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరానికి తమ పెంపుడు జంతువులను తీసుకురావాలనుకున్నవారు 93550 53890 మొబైల్ నెంబరులో ముందుగా పేరు నమోదు చేసుకోవాల్సివుంటుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 19: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్ సిడ్కో: పత్రవాక్కం, పిల్లయార్ ఆలయ వీధి, సిడ్కో ఎస్టేట్ నార్త్, భజన ఆలయ వీధి, బ్రాహ్మణ వీధి, యాదవ వీధి, ట్యాంక్ బండ్ రోడ్డు, కాంచనకుప్పం, రైల్వేస్టేషన్ రోడ్డు, పాల డైరీ రోడ్డు, తాస్ ఏరియా. **డీజీ నగర్ (గిండి):** ఆదంబాక్కం ఈబీ కాలని 1 నుంచి 5 వీధులు, ఎల్‌హెచ్ నగర్, రాధా నగర్, వేల్ నగర్, మోహనాపురి, బృందావన్ నగర్. **నంగనల్లూర్:** సోలయప్పన్ వీధి, యూనియన్ కార్బైడ్ కాలని, పులిదివాక్కం మెయిన్ రోడ్డు, తంగవేలు వీధి, అన్నామలై వీధి, వేలాయుధం వీధి, ఎంపీ రాజగోపాల్ వీధి, భగత్‌సింగ్ వీధి, ఆర్ముగం వీధి, సెంగల్వరాయన్ వీధి.

రేపటి నుంచి ప్రత్యేక బస్సులు

పెరంబూర్, సెప్టెంబరు 19: వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం పలు నగరాల నుంచి 890 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో... కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కళ్లకుర్చి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం 260 బస్సులు, 21వ తేది (శనివారం) 260 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. కోయంబేడ్ బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 65 బస్సులు నడుపనున్నారు. అలాగే, మాధవరం బస్టాండ్ నుంచి విల్లుపురం, చిదంబరం, తిరువణ్ణామలై తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఇక, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర నగరాల నుంచి పలు నగరాలకు 200 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. సెలవులు ముగించుకొని తిరిగి వచ్చే వారి సౌకర్యార్థం అన్ని నగరాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.



పరోటా తయారీ -మసాలా తయారీలో యువకులు

ఆలయ వేడుకల్లో 'పరోటాలు', 'చపాతీలు'

పెరంబూర్, సెప్టెంబరు 19: తెన్‌కాశి జిల్లా అలంకుళం గ్రామంలోని ముత్తుమారియమ్మన్, భద్రకాళి అమ్మవార్ల ఆలయ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆ ప్రాంత యువకులు చపాతీలు, పరోటాలతో ఆహారం అందజేశారు. ముత్తుమారియమ్మన్ ఆలయ వేడుకలు ఇటీవల వైభవంగా జరిగాయి. ఈ వేడుకల సందర్భంగా ఆ ప్రాంత యువకులు చపాతీలు తయారుచేసి భక్తులకు అన్నదానంగా అందజేశారు. అలాగే, భద్రకాళి అమ్మవారి ఆలయ వేడుకలు బుధవారం జరిగాయి. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆ గ్రామానికి చెందిన 16 మంది యువకుల బృందం 750 కిలోల పిండితో 9,800 పరోటాలు తయారుచేశారు. పరోటాలతో పాటు కుర్మా కూడా అందజేశారు. వేడుకల్లో పాల్గొన్న చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సుమారు 3 వేల మందికి పరోటాలు అందజేశారు.

రాష్ట్రంలోని వైద్యసేవలను ప్రశంసించిన ఆస్ట్రేలియా దౌత్యాధికారి

● మంత్రి ఎం.సుబ్రమణ్యం

ప్యారీస్, సెప్టెంబరు 19: రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను ఆస్ట్రేలియా దౌత్యాధికారి ప్రశంసించారని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. భారత్‌లో ఆస్ట్రేలియా దౌత్యాధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సిలాయ్‌సాకి, ఉప దౌత్యాధికారి జనరల్ డేవిడ్ ఎకలెక్స్‌టన్, పథక మేనేజర్ కార్తికేయన్ సచివాలయంలో మంత్రి సుబ్రమణ్యంతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... భారత్, ఆస్ట్రేలియాలో లభిస్తున్న వైద్య సేవలపై చర్చించామన్నారు. ఆస్ట్రేలియాలో సుమారు 10 లక్షల మంది భారతీయులు నివసిస్తుండగా, వారిలో తమిళులు కూడా అధికంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న మక్కల్ తేడి మరుదువం, ఇన్నుయిర్ కాప్పోం, అవయవ మార్పిడి, ముఖ్యమంత్రి బీమా సహా పలు పథకాలను ఆస్ట్రేలియా బృందం ప్రశంసిందని తెలిపారు. త్వరలో తమ దేశంలో పర్యటించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలు కూడా పరిశీలించాలని ఆ బృందం తమను కోరిందని మంత్రి తెలిపారు.

నేడు 8వ తరగతి పరీక్షా ఫలితాలు

ప్యారీస్, సెప్టెంబరు 19: ఎనిమిదో తరగతి ప్రత్యేక పరీక్షా ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు పరీక్షల శాఖ డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో ప్రైవేటు అభ్యర్థులకు 8వ తరగతి పబ్లిక్ పరీక్షలు గత నెల 19 నుంచి 23వ తేది వరకు జరిగాయి. ఈ పరీక్షా ఫలితాలు పరీక్ష శాఖ వెబ్‌సైట్ www.dge.tn.gov.in లో శుక్రవారం విడుదల కానున్నాయి. అభ్యర్థులు తమ రిజిస్టర్ నెంబరు, పుట్టిన తేది నమోదుచేసి ఫలితాలు తెలుసుకోవచ్చని పరీక్ష శాఖ తెలిపింది.

అద్దె ఒప్పందాలకు రూ.200 స్టాంప్ పేపరు

ఐసిఎఫ్, సెప్టెంబరు 19: గృహాలు, దుకాణాల అద్దె ఒప్పందాలకు ఇకపై రూ.200 స్టాంప్ పేపర్లు వినియోగించాలని రిజిస్ట్రేషన్ శాఖ సూచించింది. ఆస్తులను కొనుగోలు చేసేటప్పుడు వాటి విలువలో 7 శాతం స్టాంప్ పేపర్లు, 2 శాతం రిజిస్ట్రేషన్ రుసుము వసూలుచేస్తున్నారు. ఇళ్ల అద్దె, భూముల లీజుకు సంబంధించిన ఒప్పందాలను రిజిస్టర్ చేయడం లేదు. ఇంటి యజమాని 11 నెలలు ఒప్పంద పత్రాలు రాయించుకుంటున్నారు. వీటిని ప్రతి సంవత్సరం రెన్యువల్ చేస్తుంటారు. ఇలాంటి పత్రాలకు రూ.20 స్టాంప్ పేపర్లు వినియోగిస్తుండగా, ఇకపై రూ.200ల స్టాంప్ పేపర్లు వినియోగించాలని రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం



మొక్కలు నాటుతున్న సౌమ్య అన్బుమణి

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషిచేయాలని పసుమై తాయగం అధ్యక్షులు సౌమ్య అన్బుమణి పిలుపునిచ్చారు. స్థానిక పోరూర్‌లోని శ్రీ రామచంద్ర ఉన్నతవిద్య, పరిశోధన సంస్థ కార్యాలయం ప్రాంగణంలో రెయిన్‌బో రోటరీ క్లబ్, పసుమై తాయగం ఆధ్వర్యంలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమైంది. రోటరీ క్లబ్ అధ్యక్షుడు అరుణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో కలసి సౌమ్య మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యంలో లక్ష మొక్కలు నాటనున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీ రామచంద్ర ఉన్నత విద్య, పరిశోధన సంస్థ పథక అధికారి డా.అనితారాణి, రోటరీ క్లబ్ నిర్వాహకులు ఆనంద్, జయప్రకాష్, పసుమై తాగయం సహాయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లయన్ ఎన్.కన్నన్, సభ్యులు పొన్మలై, రాజేశ్వరన్, అశోక్‌బాలాజి, అలపాక్కం శేఖర్, దక్షిణా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లు జిల్లుమంటున్న ఊటీ మంచు సీజన్ ప్రారంభం



మొక్కలపై నీటి బిందువులు

పెరంబూర్, సెప్టెంబరు 19: నీలగిరి జిల్లా ఊటీలో మంచు కురవడం ప్రారంభం కావడంతో, చలి తీవ్రత కూడా అధికమైంది. జిల్లాలో సెప్టెంబరు నుంచి జనవరి వరకు మంచు కురవడం ప్రారంభమవుతుంది. ఈ ఏడాది రుతుపవనాల ప్రభావంతో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో, మంచు కూడా మొదలైంది. గురువారం ఉదయం ఊటీలోని పలు ప్రాంతాల్లోని మొక్కలు నీటి బిందువులతో కనిపించాయి. అలాగే, రోడ్డు పక్కన వాహనాలు కూడా మంచుతో నిండాయి. దీంతో, చలి తీవ్రత అధికం కావడంతో ఉదయం నుంచే ప్రజలు స్వెట్టర్లు, మఫ్లర్లు ధరించి వెళుతున్నారు.

నేటినుంచి సివిల్స్ మెయిన్స్ ప్రారంభం

● చెన్నైలోనే పరీక్షా కేంద్రాలు

అడయార్, సెప్టెంబరు 19: యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్ ప్రవేశ పరీక్షలు శుక్రవారం దేశ వ్యాప్తంగా ప్రారంభంకానున్నాయి. దీనికోసం తమిళనాడు రాష్ట్రంలో ఒకే ఒక్కచోట చెన్నైలోనే పరీక్షా కేంద్రాలు కేటాయించారు. ఈ పరీక్షకు రాష్ట్రం నుంచి 600 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. 20వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 (ఎస్సే), 21వ తేదీ పేపర్-2 (జనరల్ స్టడీస్), మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్-3 (జనరల్ స్టడీస్) పరీక్ష జరుగనుంది. 22వ తేదీ పేపర్ 4, 28వ తేదీన ఉదయం పార్ట్ ఏ కింద భారతీయ భాషలకు సంబంధించిన పరీక్ష, మధ్యాహ్నం పార్ట్ బి కింద ఇంగ్లీష్ పరీక్షను నిర్వహిస్తారు. 29వ తేదీ ఉదయం ఆప్షనల్ సబ్జెక్టు పేపర్ 1, మధ్యాహ్నం రెండో పేపర్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేశారు. చెన్నై కేంద్రంలోని ఎగ్మోర్ మహిళా హైస్కూల్, పెరంబూర్ బాలికల మహోన్నత పాఠశాల, కోడంబాక్కం ట్రస్ట్‌పురంలోని పీజీకేజీ ప్రభుత్వ పాఠశాలలో పరీక్షకు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రానికి 20 నిమిషాలు ముందుగా చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్ష ప్రారంభమైన 10 నిమిషాల తర్వాత అనుమతించరు. అలాగే, మొబైల్ ఫోన్‌తో సహా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్ళడానికి వీల్లేదని యూపీఎస్సీ స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది.

టెస్ట్‌మ్యాచ్ తొలిరోజు 10,371 మంది అభిమానులు

పెరంబూర్, సెప్టెంబరు 19: స్థానిక చేపాక్కం క్రికెట్ స్టేడియంలో భారత్-బంగ్లాదేశ్ మధ్య టెస్ట్ మ్యాచ్ గురువారం ప్రారంభమైంది. ఐదురోజులు జరిగే ఈ మ్యాచ్‌కు ప్రతిరోజు ఉదయం 7 గంటలకు అభిమానులు టిక్కెట్లు కొనుగోలు చేయవచ్చని ప్రకటించిన అధికారులు, ప్రవేశ రుసుము రూ.200 నుంచి రూ.1,000గా నిర్ణయించారు. తొలిరోజు మ్యాచ్‌ను 10,371 మంది వీక్షించారని, రాబోయే రోజుల్లో అభిమానుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

కార్పొరేషన్‌లో 23 మంది ఉద్యోగుల బదిలీ

వేలూరు, సెప్టెంబరు 19: స్థానిక కార్పొరేషన్‌లో మూడేళ్లకు పైగా పనిచేస్తున్న 23 మంది ఉద్యోగులను ఇతర మండలాలు, కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ కమిషనర్ జానకి ఉత్తర్వులు జారీచేశారు.

పేదలకు ఇళ్లు నిర్మించిన సమాజసేవకుడు



రేకులు ఏర్పాటుచేస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, సెప్టెంబరు 19: స్థానిక అలమేలు రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శరవణన్ ఏడు కుటుంబాలకు సిమెంటు రేకులతో కూడిన ఇళ్లు నిర్మించి అందజేశారు. తిరువణ్ణామలై జిల్లా జువ్వాదు కొండల్లో గత నెలలో కురిసిన భారీవర్షాలతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో, పేదరికంతో ఉన్న ఏడు కుటుంబాలకు సిమెంటు రేకులతో కూడిన ఇళ్లను దినేష్ శరవణన్ ఏర్పాటుచేసి అందజేశారు.

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాల పరిశీలన



నిర్మాణపనులు పరిశీలిస్తున్న మంత్రి వేలు, కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, సెప్టెంబరు 19: స్థానిక ప్రభుత్వ పెండెలెంట్ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.150 కోట్లతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఈ పనులను మంత్రి ఏవీ వేలు పరిశీలించారు. ఏడంతస్తులతో, అత్యాధునిక వైద్య పరికరాలతో ఏర్పాటవుతున్న ఈ ఆస్పత్రి 2025 మార్చిలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. 568 పడకలు, 10 ఆపరేషన్ థియేటర్లు, ప్లాస్టిక్ సర్జరీ, ఎమర్జెన్సీ విభాగం తదితరాలతో పాటు స్పెషలిస్ట్ వైద్యులను నియమించనున్నట్లు మంత్రి వేలు తెలిపారు. మంత్రి వెంట కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యేలు కార్తికేయన్, నందకుమార్, నల్లతంబి, వేలూరు మేయర్ సుజాత ఆనందకుమార్, పీడబ్ల్యూడీ ఇంజనీర్లు బాలమురుగన్, జయరామన్, అసిస్టెంట్ ఇంజనీర్ పడవేట్టాన్ తదితరులున్నారు.

వక్ఫ్ సభ్యుడిగా నవాజ్‌ఘనీ ఎంపిక

ఐసిఎఫ్, సెప్టెంబరు 19: రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడిగా లోక్‌సభ ఎంపీ నవాజ్ ఘనీ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సభ్యుల ఎన్నికలో పార్లమెంటు ముస్లిం సభ్యుల విభాగంలో ఒక్క స్థానానికి ఎన్నిక ప్రకటించారు. రామనాథపురం ఎంపీ నవాజ్‌ఘనీ మాత్రమే నామినేషన్ వేశారు. దీంతో, ఆయన ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఇదివరకే బోర్డు అధ్యక్షుడుగా ఉన్న అబ్దుల్ రెహ్మాన్ తన పదవికి రాజీనామా చేయగా, నవాజ్ ఘనీ సభ్యుడు కావడంతో ఆయనకే బోర్డు అధ్యక్ష పదవి ఇవ్వనున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.

రూ.100 కోట్ల భూ కుంభకోణం వ్యవహారం

● మాజీ మంత్రి తమ్ముడిపై కొత్త కేసు

● సీబీసీఐడీ విచారణ

అడయార్, సెప్టెంబరు 19: వంద కోట్ల రూపాయల విలువైన భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసిన కేసులో అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ తమ్ముడు శేఖర్‌ను సీబీసీఐడీ పోలీసులు విచారణ జరిపారు. కరూర్ జిల్లా వాంగల్ కుప్పిచ్చిపాళయం ప్రాంతానికి చెందిన ప్రకాష్ అనే వ్యాపారవేత్తకు చెందిన రూ.100 కోట్ల విలువ చేసే 22 ఎకరాలను ఆక్రమించుకోవడమే కాకుండా, ప్రకాష్‌ను హత్య చేస్తామంటూ బెదిరించినందుకు మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ సహా ముగ్గురిపై కేసు నమోదైంది. ఈ కేసును సీబీసీఐడీ పోలీసులు విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో జూన్ 16న విజయభాస్కర్‌ను పోలీసులు అరెస్టు చేయగా, గత నెల 31వ తేదీన షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో ఇదే కేసులో విజయభాస్కర్ సోదరుడు శేఖర్‌ను ఈ నెల 2వ తేదీన అరెస్టు చేసి తిరుచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు. కోర్టు అనుమతి మేరకు కస్టడీలోకి తీసుకుని రెండు రోజుల పాటు విచారించి, తిరిగి జైలుకు తరలించారు. ఇదిలావుండగా ప్రకాష్ వాంగల్ పోలీస్ స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేయడంతో హత్యా బెదిరింపులు, కిడ్నాప్ వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, ఈ కేసులోనూ అరెస్టు చేశారు. ఈ కొత్త కేసులో శేఖర్‌ను విచారించేందుకు పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కరూర్ కోర్టులో పిటిషన్ వేయగా, రెండు రోజుల కస్టడీకి అనుమతిచ్చింది. దీంతో తిరుచ్చి కేంద్ర కారాగారంలో ఉన్న శేఖర్‌ను బుధవారం కస్టడీలోకి తీసుకుని, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు విచారణ జరిపారు. అలాగే, గురువారం కూడా ఉదయం 8 గంటల నుంచి విచారణ ప్రారంభించి రాత్రి వరకు కొనసాగించారు.

కుమరిలో వెనక్కి వెళ్లిన సముద్రం

ఇసుకలో కూరుకుపోయిన ఎక్స్‌కవేటర్



ఐసిఎఫ్, సెప్టెంబరు 19: కన్నియాకుమారి తీరంలో ఓ ఎక్స్‌కవేటర్ ఇసుకలో కూరుకుపోయింది. సముద్రం మధ్యలో ఉన్న వివేకానంద రాక్, తిరువళ్లువర్ విగ్రహం వద్దకు పర్యాటకులను తీసుకెళ్లేందుకు పూంపుహార్ నౌకాయాన సంస్థ మూడు పడవలు నడుపుతోంది. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే పడవ రవాణా బుధవారం సముద్రపు నీటిమట్టం తగ్గడంతో ప్రారంభించలేదు. ఇసుక మేటలు బయల్పడడంతో పడవలు తీరంలో స్పష్టంగా కనిపించాయి. ఆ ఇసుక తొలగించేందుకు ఎక్స్‌కవేటర్ వినియోగించగా ఇసుకలో కూరుకుపోయింది. అనంతరం భారీ క్రేన్ రప్పించి ప్రొక్లెయిన్ వెలికితీశారు. ఉదయం 10 గంటలకు పైగా పడవ రవాణా ప్రారంభమైంది.

బాణసంచా కర్మాగారంలో పేలుడు

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు

పెరంబూర్, సెప్టెంబరు 19: విరుదునగర్ జిల్లా సాత్తూర్ సమీపంలో బాణసంచా కర్మాగారంలో సంభవించిన పేలుడులో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. కుకన్‌పారై ప్రాంతంలో బాలమురుగన్‌కు చెందిన బాణసంచా కర్మాగారంలో గురువారం ఉదయం కార్మికులు టపాసులకు అవసరమైన మందు కలుపుతున్న సమయంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి.ఈఘటనలో కర్మాగారంలోని ఒక గది నేలమట్టమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేశారు. ఈ ఘటనలో గోవిందరాజ్ అనే కార్మికుడు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, గురుమూర్తి అనే కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎం దిగ్ర్భాంతి...

విరుదునగర్ జిల్లాలో సంభవించిన బాణసంచా పేలుడుపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో, ఈ ఘటనలో మృతిచెందిన గోవిందరాజ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపడంతో పాటు రూ.3 లక్షలు, గాయపడిన గురుమూర్తికి రూ.50 వేలు అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు.

యువతిపై సామూహిక అత్యాచారం

పెరంబూర్, సెప్టెంబరు 19: యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన అగంతకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. శివకాశి జిల్లా మానమధురై సమీపంలోని ఓ ప్రాంతంలో బుధవారం రాత్రి ఓ యువతి తన స్నేహితుడితో మాట్లాడున్న సమయంలో అటుగా వచ్చిన ఓ ముఠా, యువతితో మాట్లాడుతున్న యువకుడిపై దాడిచేయడంతో అతను పరారయ్యాడు. దీంతో, ఆ ముఠా యువతిని పొదల చాటుకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. ఈ ముఠా నుంచి తప్పించుకున్న యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసిన పోలీసులు బాధితురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి నిందితుల కోసం గాలించారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ముత్తుకుమార్ అనే యువకుడిని అనుమానించిన పోలీసులు అతడిని పట్టుకొనేందుకు యత్నించగా అతను పరారయ్యాడు. దీంతో, పోలీసులు అతని ఎడమ కాలుపై తుపాకితో కాల్చడంతో అతను కింద పడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, చికిత్స నిమిత్తం శివగంగ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అజ్ఞాతంలో వున్న నిందితుడి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 19: ఒక హత్యాయత్నం కేసులో నాలుగేళ్ళుగా విదేశాల్లో తలదాచుకున్న రామనాథపురం జిల్లా వాసిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలోని కడలాడికి చెందిన మారిముత్తు (27) అనే వ్యక్తి 2020లో ఒక హత్యాయత్న కేసులో నిందితుడు. అతడిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా పోలీసుల కన్నుగప్పి విదేశాలకు పారిపోవడంతో పోలీసులు లుకౌట్ నోటీసు జారీ చేశారు. అప్పటి నుంచి విదేశాల్లోనే ఉన్న మారిముత్తు బుధవారం రాత్రి ఒమెన్ నుంచి నగరానికి రాగా, ఎయిర్‌పోర్టు పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు.

కారు వర్క్‌షాపులో భారీ అగ్నిప్రమాదం

అడయార్, సెప్టెంబరు 19: స్థానిక రామాపురంలోని కారు వర్క్‌షాపులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో లక్షల్లో ఆస్తినష్టం వాటిల్లింది. స్థానిక నందనంకు చెందిన మహ్మద్ మసూర్ రామాపురం నటేశ నగర్‌లో కారు రిపేర్ వర్క్‌షాపు నడుపుతున్నాడు. బుధవారం రాత్రి తాళం వేసి ఇంటికి వెళ్ళాడు. అయితే, గురువారం తెల్లవారుజామున వర్క్‌షాపు నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన ఇరుగుపొరుగువారు పోలీసులకు సమాచారమివ్వగా, అగ్నిమాపక సిబ్బందితో వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో లక్షలాది రూపాయల విలువ చేసే ఆస్తి నష్టం వాటిల్లినట్టు మహ్మద్ వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

విషాహారం తిన్న 17 నెమళ్ల మృతి



మృతిచెందిన నెమళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 19: దిండుగల్ జిల్లా రెడ్డియార్ సత్రం సమీపం బోడినాయకన్ పట్టికి చెందిన మురుగన్ పొలం సమీపంలో 17 నెమళ్లు మృతిచెంది పడి ఉన్నాయని అటవీ, పోలీసు అధికారులకు సమాచారం అందింది. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న కన్నివాడి ఫారెస్ట్ రేంజర్ ఆర్ముగం విచారణ చేపట్టి, 9 మగ, 8 ఆడ నెమళ్లుగా గుర్తించారు. అనంతరం వెటర్నరీ వైద్యులను రప్పించి నెమళ్ల కళేబరాలకు పోస్టుమార్టం జరిపించగా విషం కలిపిన గింజలు తిని మృతిచెందినట్లు నిర్ధారణ అయింది. ఈ విషయమై మురుగన్‌ను విచారించగా, నెమళ్లు తరచూ వచ్చి పంటలు ధ్వంసం చేస్తున్నాయని, అందువల్లే తాను ఈ విధంగా చేసినట్టు అంగీకరించాడు. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

విద్యుదాఘాతానికి గురైన కాకికి ప్రథమ చికిత్స

● అగ్నిమాపక సిబ్బందికి అభినందనలు



కాకికి ప్రథమ చికిత్స చేస్తున్న దృశ్యం

పెరంబూర్, సెప్టెంబరు 19: కోయంబత్తూర్ జిల్లాలో విద్యుదాఘాతానికి గురై స్పృహతప్పిన కాకికి అగ్నిమాపక సిబ్బంది ప్రాథమిక చికిత్స చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. గౌండరపాళయం సమీపంలో ఓ కాకి విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై కింద పడింది. గమనించిన అగ్నిమాపక ఉద్యోగి వెల్లదురై, సీపీఆర్ చేసి కాకిని కాపాడాడు. అనంతరం కాకి నోట్లో గాలి ఊదడంతో అది కాస్త కదిలింది. దీంతో, కాకిని అగ్నిమాపక కేంద్రానికి తీసుకెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత కాకి సహజ స్థితికి చేరుకొని ఎగురుతూ వెళ్లింది. కాకిని వెల్లదురై కాపాడే దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి.

మూడు నెలల చిన్నారి సాధన 130 చిత్రాల గుర్తింపు



చిత్రాలు గుర్తిస్తున్న ఆధిరన్

పెరంబూర్, సెప్టెంబరు 19: ఈరోడ్ పెరియార్ నగర్ ప్రాంతానికి చెం దిన ఐటీ ఉద్యోగి సునీల్‌హరి భాస్కర్, లోహిత్‌సోనాలి దంపతులకు మూడు నెలల కుమారుడున్నాడు. ఆ బాలుడికి రెండు నెలలు ఉన్నప్పటి నుంచే తల్లి నలుపు, తెలుపు రంగుల్లో ఉన్న ఫొటోలు చూపించడం ప్రారంభించింది. ఆ తర్వాత ఆంధ్ర రాష్ట్రానికి చెందిన నాలుగు నెలల ఆడ శిశువు కొన్ని చిత్రపటాలు చూసి వాటికి సరైన స్పెల్లింగ్ చెప్పే విభాగంలో నోబెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుచేసుకుంది. దీంతో, లోహిత్, తన మూడు నెలల కుమారుడికి కొన్ని చిత్రాలు చూపించి వాటిని గుర్తించే లా శిక్షణ ఇచ్చారు. చిన్నారి చిత్రాలు గుర్తుపట్టే దృశ్యాలు వీడియోగా తీసి నోబెల్ కమిటీకి పంపించారు. దీనిని ఎంపిక చేసిన కమిటీ, మూడు నెలల మగ శిశువు అధిరన్ పండ్లు, కూరగాయలు, సంఖ్యలు, ఆకారా లు కలిగిన 130 ఫొటో కార్డులను సరిగ్గా గుర్తించడాన్ని, పిల్లల ఫొటో మెమొరీ విభాగంలో పేరు నమోదుచేస్తూ సర్టిఫికెట్, పతకం అందజేశారు.

అలల తాకిడికి విద్యార్థి మృతి

ప్యారీస్, సెప్టెంబరు 19: స్థానిక ఎన్నూర్ సముద్రతీరంలో స్నేహితులతో కలసి స్నానాలకు వెళ్లిన కళాశాల విద్యార్థి హరీష్ (17) హఠాత్తుగా అలల్లో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న తీర ప్రాంత రక్షణ సిబ్బంది, స్థానిక జాలర్లతో కలసి గాలించారు. కొద్దిసేపటికి హరీష్ మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. కాగా, హరీష్‌ను కాపాడేందుకు యత్నించి, శ్వాస తీసుకోలేకపోయిన అతడి స్నేహితుడు మోహన్‌ను స్థానికులు స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


ఏడాదిలో 77 ఎకరాల స్వాధీనం

ఐసిఎఫ్, సెప్టెంబరు 19: స్థానిక షోలింగనల్లూర్‌లో ఏడాదిలో 77 ఎకరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నై కలెక్టర్ కార్యాలయ పరిధిలో షోలింగనల్లూర్ తాలూకా అధిక విస్తీర్ణం కలిగి ఉంది. ఇక్కడ ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయి. గత ఏడాదిలో రెవెన్యూ అధికారులు కోర్టు ఉత్తర్వుల మేరకు 77.24 ఎకరాల భూములను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

ఆధ్యాత్మికం

కడలూరు జిల్లా తిరుకళిప్పాలై వద్ద వెయ్యేళ్లనాటి వేదనాయకి సమేత పాల్‌వణ్ణనాథర్ ఆలయం ప్రఖ్యాత శైవక్షేత్రంగా విరాజిల్లుతోంది. కపిలమహర్షి నిర్మించిన ఈ ఆలయంలో శ్వేతవర్ణ సైకత శివలింగం కనువిందు చేస్తుంది. ఆలయంలో కొలువైన పరమేశ్వరుడిని తిరునావుక్కరసర్, తిరుజ్ఞానసంబంధర్, సుందరర్ వంటి శైవభక్తశిఖామణులు తమ రచనల్లోను, తిరుప్పుగళ్‌లో అరుణగిరినాథర్ కీర్తించారు. పౌరాణిక కాలంలో ఈ క్షేత్రం వడకావేరి అనే కొళ్ళిడం వాగు, కడలిలో కలిసే ప్రాంతంలో ఉండేది. ఉప్పెనలా ముంచుకొచ్చిన వరదల కారణంగా ఆలయం శిథిలమైంది. దీంతోభక్తులు ఈ స్థలమూర్తిని అదే ప్రాంతంలో ఉన్న మరొక చోట నిర్మించినట్లు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై


గర్భాలయంలోని శ్వేతవర్ణ సైకత మహాలింగం

భక్తవల్లభుడు

శ్వేతవర్ణ సైకత లింగేశ్వరుడు

● శైవభక్త శిఖామణులు ఆరాధించిన దివ్యక్షేత్రం ● కపిలమహర్షి నిర్మించిన 'పాల్‌వణ్ణనాథర్' ఆలయం


అంతర ప్రాకారంలో వళ్లీదేవసేన సమేత షణ్ముఖాలయం

స్థలపురాణం : కపిల మహర్షి భూలోకంలో తీర్థయాత్రలు చేస్తూ పరమేశ్వరుడి దర్శనం చేసుకుంటూ వచ్చారు. ఆ తీర్థయాత్రలో భాగంగా అన్ని వైపులా పచ్చదనంతో బిల్వవనంలా ఉన్న ఈ క్షేత్రానికి విచ్చేశారు. ఆ తర్వాత అక్కడే బసచేసి పరమశివుడిని ఆరాధిస్తూ ప్రత్యేక పూజలు చేయాలని నిర్ణయించారు. ఆ సమయంలో ఆ ప్రాంతమంతటా పాలనురుగు వలె తెల్లటి ఇసుక పరచుకుని ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. ఇసుకకు పాలనురుగు రంగు రావటానికి కారణం కూడా ఆయన తెలుసుకోగలిగారు. ఆ ప్రాంతానికి మేతకు వచ్చే పశువులన్నీ ఇళ్ళకు తిరిగి వెళుతూ, ఆ ప్రాంతంలోని ఇసుకపై పాలను వదులుతూ వెళ్ళాయి. ఆ పాలు అంతటా వ్యాపించడంతో ఇసుకకు శ్వేత వర్ణం వచ్చిందని నిర్ధారించుకున్నారు. ఆ తర్వాత పాల నురుగులా తెల్లగా ఉన్న అక్కడి ఇసుకతో శివలింగాన్ని తయారు చేసి అక్కడే ప్రతిష్ఠించి శివపూజ చేసారు. ఓ సారి ఆ మార్గంలో శుక్రుడనే రాజు గుర్రంపై వచ్చారు. ఆ గుర్రపు కాలిగిట్ట తగలటంతో శివ లింగంపై చిన్న గొయ్యి ఏర్పడింది. శివపూజ కోసం వచ్చిన కపిలముని, శివలింగంపై ఉన్న గొయ్యిని చూసి చాలా బాధపడ్డారు. దెబ్బతిన్న ఆ శివలింగాన్ని తొలగించి కొత్తగా మరొక లింగాన్ని ఆ చోట ప్రతిష్ఠ చేస్తుండగా పార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమయ్యారు. 'మునీశ్వరా పశువులు స్రవించిన పాలతో కలిసి ఇసుకతో తయారైన ఈ శివలింగాన్ని తొలగించకుండా ప్రస్తుతమున్న విధంగానే పూజలు కొనసాగించండి. కామధేనువే ఇక్కడ పాలను స్రవించింది. ఈ క్షీర సైకత శివలింగాన్ని ఆరాధించే భక్తులకు సకల సౌభాగ్యాలు కలగుతాయి' అని చెప్పి అంతర్థానమయ్యారు. శివుడి ఆదేశం ప్రకారం కపిలముని ఆ శివలింగానికే పూజలు చేశారు. ఈ శ్వేతవర్ణ సైకత శివలింగాన్ని తమిళంలో 'పాల్‌వణ్ణనాథర్' అనిపిలుస్తున్నారు.. శివలింగం ప్రతిష్ఠించిన ప్రాంతం నేటికీ వెళ్లయ్ మణల్ (తెల్లటి ఇసుక) అని పిలువబడుతోంది.


గర్భాలయ ప్రవేశద్వారం వద్ద అద్భుత శిల్పం

ప్రసాదంగా అభిషేక పాలు.. : గర్భాలయలో మూలవర్లయిన పాల్‌వణ్ణనాథర్ తూర్పు దిశగా దర్శనమిస్తున్నారు. ఆయన వెనుక పార్వతీపరమేశ్వరులు నవ దంపతుల అలంకారంతో కనువిందు చేస్తారు. ఆలయంలోని శ్వేతవర్ణ సైకత లింగంపై గుర్రపు కాలి గిట్ట తగలటంతో ఏర్పడిన గొయ్యి రెండు లీటర్ల పాలు పట్టేంతగా ఉంటుంది. రోజూ క్షీరాభిషేకం తర్వాత ఆ గొయ్యిలో ఉన్న పాలనే భక్తులకు ప్రసాదంగా ఇస్తున్నారు. ఆ పాలను తాగితే సకల దోషాలు తొలగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అన్ని శివాలయాలలో జరిగే విధంగానే ఈ ఆలయంలో ప్రతియేటా శివరాత్రి వేడుకలు, వార్షిక బ్రహ్మోత్సవాలు, ఇతర ఉత్సవాలు జరుగుతాయి..


ఆలయ ప్రవేశద్వారం

భైరవ దర్శనం.. : మూర్తి, క్షేత్రం, తీర్థం అంటూ మూడు రకాల కీర్తి సంపాదించుకున్న ఈ ఆలయంలో మరొక ప్రత్యేకత కూడా ఉంది. ఈ ఆలయంలోని ఆగ్నేయ మండపంలో ప్రత్యేక సన్నిధిలో కాలభైరవుడు దర్శనమిస్తున్నారు. శివుడి 64 రూపాల్లో రుద్ర రూపుడిగా పిలిచే కాలభైరవుడు శివాలయాలన్నింటిలోనూ కొలువుదీరి ఉంటారు. ఈ ఆలయంలో కాల భైరవుడు కాశీక్షేత్రంలో ఉన్న కాల భైరవుడిలా శునక వాహనరహితుడై ఉన్నారు. నాలుగడుగుల ఎత్తులో 27 కపాలాల (పుర్రెలు)ను మాలగా ధరించి, సింహపు కోరలు కలిగి ఉన్నారు. కాశీ క్షేత్రంలోని ఎనిమిది కాలభైరవుడి విగ్రహాలను చెక్కిన శిల్పి ఇక్కడి కాల భైరవుడి విగ్రహాన్ని కూడా చెక్కాడని స్థలపురాణం బట్టి తెలుస్తోంది. ఈ కాలభైరవుడిని మొక్కితే కాశీలోని భైరవుడిని దర్శిస్తే వచ్చే పుణ్యఫలాలు దక్కుతాయని భక్తుల ప్రగాఢవిశ్వాసం. శుక్లపక్షం అష్టమి దినాన ఈ కాలభైరవ స్వామికి నిర్వహించే ప్రత్యేక అభిషేక, ఆరాధనల్లో పాల్గొంటే సకల సౌభాగ్యాలు, సంపూర్ణ ఆరోగ్యం ప్రాప్తిస్తాయని చెబుతున్నారు.


వేదనాయకి అమ్మవారు

ఎలా వెళ్ళాలి?... : రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుండి కడలూరు జిల్లా చిదంబరానికి ప్రభుత్వ రవాణా, ప్రైవేటు బస్సులున్నాయి. చిదంబరం నుంచి జయంకొండం వెళ్లే బస్సులో ప్రయాణిస్తే ఐదు కిలోమీటర్ల దూరంలో తిరుక్కళిప్పాలై క్షేత్రాన్ని చేరుకోవచ్చు. ఆటోలో, టాక్సీలలోను వెళ్లవచ్చు. ఈ ఆలయానికి చేరువగానే చిదంబరం రైల్వేస్టేషన్ కూడా ఉంది. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 7 నుండి 11.30 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 5 నుండి రాత్రి 7.15 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఆలయ వైభవం...

ఈ ఆలయం సుమారు వెయ్యేళ్ల నాటిదని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. మూడంతస్థుల రాజగోపురం తూర్పు దిశగా నిర్మించారు. రాజగోపురానికి ముందు సగభాగం మట్టిలో కూరుకుపోయి నల్లరాతితో తయారైన నంది విగ్రహం కనిపిస్తుంది. అంతర ప్రాకారం ప్రవేశద్వారంలో ఇరువైపులా నంది, ఆయన సతీమణి విగ్రహాలున్నాయి. ప్రాకారంలో నైరుతి దిశగా మహా గణపతి సన్నిధి, దాని తర్వాత మండపంలో బాల గణపతి, నాగదేవుడు, ఆత్మలింగం, జ్యోతిర్లింగం, కిరాతమూర్తి, మహావిష్ణువు, మెయ్యపొరుళ్ నాయినార్, శైవ భక్తశిఖామణులు కొలువుదీరి ఉన్నారు. మరో ప్రత్యేక సన్నిధిలో వళ్లి, దేవసేన సమేతుడైన షణ్ముఖుడు, గజలక్ష్మి, భువనేశ్వరి దర్శనమిస్తున్నారు. ఆ తర్వాత వాహన మండపం, గోముఖం, వాటి సమీపంలో చండేశ్వర సన్నిధులున్నాయి. గర్భాలయ గోష్ఠంలో దక్షిణాభిముఖంగా జయవినాయకుడు, దక్షిణామూర్తి, పడమటి దిశగా లింగోద్భవుడు, ఉత్తరదిశగా బ్రహ్మ, దుర్గాదేవి పూజలందుకుంటున్నారు. మహా మండపం వెలుపల ప్రాకార ప్రదక్షిణ ముగిసే చోట మరొక దుర్గాదేవి దర్శనమిస్తున్నారు. ఈ అమ్మవారిని చతురా దుర్గా అని పిలుస్తారు. నాలుగు యుగాలకు ముందటిదని బావిస్తున్న ఈ విగ్రహం ఎడమచేయి కాస్త దెబ్బ తిని ఉండటంతో ఆలయంలో ఉంచకుండా మండపం బయట ఉంచారు. ముఖ్యమైన ఉత్సవాల సమయంలో ఈ దుర్గాదేవికి వెండితో తయారు చేసిన హస్తాన్ని అమర్చుతుంటారు. ఆలయానికి ఈశాన్య మండపంలో కాలభైరవుడు, నవగ్రహాల సన్నిధి, సూర్య చంద్రుల విగ్రహాలున్నాయి. ఈ క్షేత్రంలోని స్వామివారిని కపిల మునీశ్వరుడు, అరుణగిరినాథర్, తిరునావుక్కరసర్, సుందరర్, తిరుజ్ఞానసంబంధర్, వాల్మీకిమహర్షి సహా ఎంతో మంది మహర్షులు దర్శించారు. పరమేశ్వరుడు కల్యాణనాథుడై దర్శనమిచ్చిన శైవక్షేత్రాల్లో ఇదొకటని చెబుతున్నారు. ప్రాకార దర్శనం తర్వాత బలిపీఠం, ధ్వజస్తంభం, ప్రత్యేక మండపంలో నందీశ్వరుడు దర్శనమిస్తారు. వీరిని దాటి లోపలకు వెళ్తే మహామండపంలో ఈశాన్యదిశగా శయనమండపం, వాయవ్యదిశగా నటరాజస్వామి, శివకామి అమ్మవారి సన్నిధులున్నాయి. ఇక్కడి నటరాజస్వామి చక్కగా శిఖ ముడివేసుకుని కనిపిస్తారు. శివకామి అమ్మవారు విజయ, సరస్వతితోపాటు కొలువుదీరి ఉంటారు.


నటరాజస్వామి

సైకలాజికల్ థ్రిల్లర్‌గా 'శారీ'

ఆర్జీవీ డెన్ నిర్మాణ సారథ్యంలో రూపొందుతున్న చిత్రం 'శారీ'. చీర ఇతివృత్తంలో సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగా తెరకెక్కిక్కించారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరోహీరోయిన్లుగా నటించారు. హీరోయిన్ గతంలో కేరళ చిత్రపరిశ్రమలో శ్రీలక్ష్మిగా గుర్తింపు పొందారు. ఇపుడు తన పేరును ఆరాధ్యగా మార్చుకున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు గిరి కృష్ణ కమల్ మాట్లాడుతూ, 'నిజ జీవితంలోని అనేక వాస్తవిక సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. చీర కట్టులో ఉండే ఒక మహిళపై పిచ్చి ప్రేమను చూపించే ఒక వ్యక్తి ఆమె వెంటపడుతూ వేధిస్తుంటాడు. ఒక దశలో అదే పెను ముప్పుగా ఎలా మారుతుందన్నదే ఈ చిత్ర కథ. తమిళం, తెలుగు, హిందీ, మలయాళం భాషల్లో ఏకకాలంలో నిర్మిస్తున్నాం, నవంబరులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.


'శారీ'లో ఆరాధ్య దేవి

ఒండ్రాగా ఎంటర్‌టైన్మెంట్

'కడలోర కవిదై' ఆల్బమ్

చిత్రజ్యోతి


నిహారిక

ఒండ్రాగా ఎంటర్‌టైన్మెంట్ బ్యానరుపై 'కడలోర కవిదై' పేరుతో ఒరిజినల్ ఆల్బమ్ రూపుదిద్దుకుంది. ఒరు ఊరిలో హౌస్ అనే సంస్థతో కలిసి నిర్మాత ప్రీతి శ్రీవిజయన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. తమిళంలో 'కడలోర కవిదై', మలయాళంలో 'ఈ తీరం' పేరుతో తెరకెక్కించే ఈ ద్విభాషా ఆల్బమ్‌కు స్వాతిని దర్శకత్వం వహించారు. దర్శన్, నిహారిక జంటగా నటించారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం. ఎడిటింగ్ ఎలై. ఎడిటింగ్ ఏ.రిచర్డ్ కెవిన్. ఈ ఆల్బమ్ సాంగ్‌కు సంబంధించిన టీజర్ ఇటీవల రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది. తమిళంలో అరుణ్ ప్రభ అందించిన సాహిత్యానికి విశాల్ సురేష్ సంగీతం సమకూర్చగా, అభిజిత్ నరోలి, శ్వేత శ్వేత సుగదన్ నేపథ్యగానం చేశారు. దీనికి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేయగా, నెట్టింట మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. ఈ ఆల్బమ్ ఒండ్రాగా ఎంటర్‌టైన్మెంట్ ప్లాట్‌ఫామ్‌లో త్వరలోనే విడుదల చేయనున్నారు.

'సార్'...నేటి సమాజానికి అవసరమైన చిత్రం

● ట్రైలర్ ఆడియో రిలీజ్‌లో వెట్రిమారన్

నేటి సమాజానికి, కాలమాన పరిస్థితులకు ఎంతో అవసరమైన ఒక మంచి చిత్రం 'సార్' అని ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ అన్నారు. నటుడు బోస్ వెంకట్ దర్శకత్వంలో విమల్ హీరోగా నటించిన 'సార్' ఎస్ఎస్ఎస్ పిక్చర్స్ బ్యానరుపై సిరాజ్ ఎస్ నిర్మించారు. విమల్, చాయా దేవి కన్నన్, సిరాజ్, రమ, జయబాలన్ తదితరులు నటించారు. ఈ సినిమా ఆడియో, ట్రైలర్ నగరంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అమ్మా క్రియేషన్స్ అధినేత అమ్మా టి.శివ, నటుడు శరవణన్, నిర్మాత ధనుం జయన్, సంగీత దర్శకుడు సిద్ధు కుమార్, గేయ రచయిత వివేకా, నటుడు, సంగీత దర్శకుడు సిద్ధార్థ్ విపిన్, హీరో విమల్, ప్రత్యేక అతిథులుగా విజయ్ సేతుపతి, వెట్రిమారన్ తదితరులు పాల్గొన్నారు. ఆడియో సీడీని విడుదల చేసిన అనంతరం వెట్రిమారన్ మాట్లాడుతూ, 'ప్రస్తుత సమాజానికి కావాల్సిన సినిమా ఇది. ఒక చర్చకు నాందిపలుకుతుంది. దర్శకుడు బోస్ వెంకట్ ఈ చిత్రాన్ని చూడాలని కోరారు. సినిమా చూడడానికి ఎక్కువ సమయం తీసుకున్నాను. ఈ సినిమా సక్సెస్ తర్వాత వచ్చే మంచి పేరంతా ఆయనకే దక్కుతుందన్నారు మరో అతిథి విజయ్ సేతుపతి మాట్లాడుతూ, 'హీరో విమల్ 'కూత్తుపట్టరై'లో శిక్షణ తీసుకునే సమయం నుంచే తెలుసు. అక్కడ విమల్ నటనకు నేను వీరాభిమానిని. బోస్ వెంకట్ సీరియల్స్‌లో నటించే సమయం నుంచే తెలుసు. ఆటో నడుపుతూనే నటించేవారు. సినిమాల్లోకి వచ్చి.. అంచలంచెలుగా ఎదిగి ఈ స్థాయికి చేరుకున్నారు. ఈ సినిమా చూశాను. చివరి 40 నిమిషాలు ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయేలా ఉంటుంది' అన్నారు. అలాగే, హీరో విమల్, దర్శకుడు బోస్ వెంకట్ తదితరులు ప్రసంగించారు.


ఆడియో రిలీజ్ చేస్తున్న వెట్రిమారన్, విజయ్ సేతుపతి, యూనిట్ సభ్యులు

'ఎంగ అప్పా' ఆడియో రిలీజ్

బేబి లక్షణ రిషి ప్రధాన పాత్రలో రూపుదిద్దుకున్న చిత్రం 'ఎంగ అప్పా'. ఎస్వీ రిషి కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. ఈ చిత్ర ఆడియో బుధవారం రాత్రి నగరంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్, కోలీవుడ్ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు హాజరై ఆడియోను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో బేబి లక్షణతో పాటు నిర్మాత అనీషా సతీష్, సంగీత దర్శకుడు సంతోష్ సాయి, నటీనటులు బైల్వాన్ రంగనాథన్, విజయ్ గణేశ్, భావ లక్ష్మణన్, బెంజిమిన్, మీసై రాజేంద్రన్, సౌందర్‌రాజన్, కరాటే రాజా, కాదల్ సుకుమార్, కాదల్ శరవణన్, అళగేష్, చిన్నరాసు, రాజాధిరాజాలతో పాటు చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. ఇందులో కె.భాగ్యరాజ్ ప్రసంగిస్తూ, 'ఒక మంచి కంటెంట్‌తో తెరకెక్కించే చిత్రాన్ని ప్రేక్షకుల ఎప్పుడూ నిరాశపరిచిన సందర్భాలు లేవు. ఈ మధ్య కాలంలో మంచి కంటెంట్‌తో వచ్చిన పలు చిత్రాలు సూపర్ హిట్ సాధించాయి. ఈ చిత్రం తండ్రి కుమార్తె సెంటిమెంట్‌తో తెరకెక్కినట్టుగా ఉంది. ఖచ్చితంగా విజయం సాధిస్తుందన్నారు. ఇందులో ప్రధాన పాత్ర పోషించిన బేబి లక్షణ భవిష్యత్‌తో మంచి కథానాయిక అవుతుందని గట్టిగా నమ్ముతున్నాను' అని పేర్కొన్నారు.


బేబి లక్షణ రిషిని అభినందిస్తున్న కె.భాగ్యరాజ్, పేరరసు తదితరులు

'కావేరి'లో స్పైయిన్ రీఛార్జ్ స్కీమ్

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లోని స్పైయిన్ ఇన్‌స్టిట్యూట్‌లో వెన్నెముక, మెడ నొప్పులు, వాటికి చికిత్సా విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా 'స్పైయిన్ రీఛార్జ్ స్కీమ్' ప్రవేశపెడుతున్నట్లు ఆ ఇన్‌స్టిట్యూట్ ప్రధానాధిపతి డాక్టర్ జి బాలమురళి తెలిపారు. గురువారం ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకు కొట్టూరుపరంలోని అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయం హాలులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎలాంటి రుసుము చెల్లించలనవసరం లేదన్నారు. మీడియా సమావేశంలో కావేరి హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌కుమార్, ఆర్థోపెడిక్ అండ్ స్పైయిన్ సర్జెన్ డాక్రట్ సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.


కొత్త స్కీమ్ వివరాలను చెబుతున్న డాక్టర్ జి. బాలమురళి

బృహద్ధమని చికిత్సల్లో సిమ్స్ రికార్డు


చికిత్స అనంతరం కోలుకున్నవారితో డాక్టర్ వీవీ బాషి. డాక్టర్ రాజు శివసామి తదితరులు

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని సిమ్స్ ఆస్పత్రిలో ఇప్పటివరకూ 800 మంది బృహద్ధమని శస్త్రచికిత్స చేసి సరికొత్త రికార్డు నెలకొల్పినట్లు హృద్రోగ చికిత్స నిపుణులు డాక్టర్ వీవీ బాషి తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో గురువారం ఉదయం బృహద్ధమని అవగాహనదినం సందర్భంగా శస్త్రచికిత్స చేసుకుని కోలుకున్న పదిమందిని మీడియా సమావేశంలో పరిచయం చేశారు. ఆస్పత్రిలో లభించే చికిత్సా విధానాలను వారు వివరించారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురున్నారు. మార్ఫన్ సిండ్రోమ్ ప్రతి 5000 మందిలో ఒకరి వస్తుందని, వీరిలో బృహద్ధమని ముడులేసుకున్నట్టుగా ఉంటుందని డాక్టర్ బాషి తెలిపారు. సకాలంలో వైద్యం పొంది ప్రాణగండం నుండి బయటపడగలుగుతారని ఆయన పేర్కొన్నారు.

బోయి భీమన్నకు ఘన నివాళి


బోయి భీమన్న జయంతి వేడుకల్లో తెలుగు ప్రముఖులు

చెన్నై, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో సామాజిక చైతన్య స్ఫూర్తి పద్మభూషణ్ బోయి భీమన్న జయంతి వేడుకలు గురువారం మధ్యాహ్నం ఘనంగా జరిగాయి.మెరీనాతీరంలోని రజతోత్సవ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకకు ఉపన్యాసకులు డాక్టర్ మాదా శంకరబాబు స్వాగతం పలుకగా, తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో బోయి నాగమ్మ, పుల్లయ్య దంపతులకు భీమన్న జన్మించారని, వారి ఐదుగురు సంతానానికి పంచపాడవుల్లాగా ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అని పేరు పెట్టారని, ఆ భీమన్నే నేటి మన కవి బోయి భీమన్న అని తెలిపారు. సమాజంలోని అన్యాయాలను ఎలుగెత్తి చాటడం కోసం వారి కలం నుంచి అనేక కవిత్వ బాణాలను సంధించిన గొప్ప కవి, సాధారణ పాలేరు కుటుంబంలో పుట్టి పద్మభూషణ్ స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బోయి భీమన్న అని అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ టీఆర్ఎస్ శర్మ మాట్లాడుతూ.. సామాజిక చైతన్యానికి అవసరమైన సాహిత్యాన్ని సృష్టించి, అంబేడ్కర్ ఆలోచనా విధానానికి అనుగుణంగా ముందుకు సాగిన వ్యక్తి బోయి భీమన్న అని కీర్తించారు. ఆత్మీయ అతిథి గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ.. భీమన్న ఆలోచనలు, ఆరాటం, తపన అంతా సమాజ మార్పు కోసమేనని, భీమన్న కలాన్ని గళంగా మార్చి విశేష సాహిత్య సంపదను సృష్టించారన్నారు. తెలుగు అతిథి అధ్యాపకులు డాక్టర్ పాండురంగం కాళియప్ప మాట్లాడుతూ.. బోయి భీమన్న జీవితం, సాహిత్యంపై ఉపన్యసించారు. కార్యక్రమంలో భాగంగా బోయి భీమన్న చిత్రపటానికి ప్రముఖులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఎస్.శశికళ వందన సమర్పణతో ముగిసిన ఈ కార్యక్రమంలో ఆచార్య ఎల్‌బీ శంకరరావు దంపతులు, రాజధాని కళాశాల తెలుగుశాఖాధ్యక్షురాలు డాక్టర్ ఎలిజబెత్ జయకుమారి, రాణీమేరి కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.దయామణి, స్వరూప, ఆధ్యాత్మికవేత్త నాగేశ్వరరావు, తెలుగు భాషాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ది మిస్చీఫ్ ఆఫ్ మ్యాథ్స్' పుస్తకావిష్కరణ

అడయార్, సెప్టెంబరు 19: నగరంలోని మ్యాథమేటికల్ ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో జరిగిన ఒక కార్యక్రమంలో రచయితలు నివేదిత గణేష్, ఇనవంశీ ఎనగంటి, ప్రొఫెసర్ బడ్ మిశ్రా కలిసి 'ది మిస్చీఫ్ ఆఫ్ మ్యాథ్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. నివేదిక గణేష్ ఐఐటీఎం రీసెర్చ్ పార్క్‌లో రీసెర్చ్ ఫెలో కాగా, ఇనవంశీ ఎనగంటి పరమ్ సైన్స్ సెంటర్ డైరెక్టర్‌గా, మిశ్రా న్యూయార్క్ వర్శిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటీఎం మాజీ డైరెక్టర్, కెమికల్ ఇంజనీరింగ్ పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన నిపుణులు, హెర్డిలియా అవార్డు గ్రహీత ఎంఎస్ అనంత్ పాల్గొన్నారు. వీరితో పాటు పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఐఐటీఎం రీసెర్చ్ పార్క్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా, చెన్నై మేథమేటికల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ మాధవ్ ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.



లెజెండ్స్ లీగ్ క్రికెట్-2024 మీట్ అండ్ గ్రీట్

అడయార్, సెప్టెంబరు 19: సదరన్ సూపర్‌స్టార్ రెండో ఎడిషన్ లెజెండ్స్ లీగ్ క్రికెట్-2024 ప్రారంభం సందర్భంగా ఎక్స్‌క్లూజివ్ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం జరిగింది. ఇందులో సీనియర్ క్రికెటర్ దినేష్, సినీ నటి ఐశ్వర్య రాజేష్ పాల్గొని సందడి చేశారు. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైకేల్ బెవాన్, భారత మాజీ క్రికెటర్లు పార్థివ్ పటేల్, కేదార్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదరన్ సూపర్‌స్టార్ టీమ్‌కు కెప్టెన్‌గా దినేష్ కార్తీక్ వ్యవహరిస్తున్నారు. ఈ లెజెండ్స్ లీగ్‌లో భాగస్వాములు కావడం ఎంతో సంతోషమని సదరన్ స్పోర్ట్స్ ఎంటర్‌టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బీవీ గౌతమ్ ఉన్నారు.


జెర్సీ ఆవిష్కరిస్తున్న ఐశ్వర్య రాజేష్, దినేష్ కార్తీక్ తదితరులు